సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం : 19 : ఏప్రిల్ : 2024




**కేసీఆర్ స్థాయికి తగవు**

కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందంటూ కేసీఆర్ మాట్లాడడం ఆయన స్థాయికి తగదని మంత్రి తుమ్మల విమర్శించారు. 8లో



**మోడీ గ్యారంటీపై విశ్వాసం**

నరేంద్ర మోడీపై ప్రజలకు ఉన్న విశ్వాసమే తనను గెలిపిస్తుందని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌రావు అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 26°

**వాతావరణం**

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. ఎండ గంటగంటకూ పెరుగుతుంది. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉంటుంది.

## న్యూస్‌రీల్

### పెద్దమ్మతల్లిని దర్శించుకున్న న్యాయమూర్తి భానుమతి



పెద్దమ్మతల్లిని దర్శించుకుంటున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి

పాల్వంచరూరల్: మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారిని గురువారం జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గొల్లపూడి భానుమతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారితో ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. వారి వెంట లీగల్ సర్వీసెస్ సభ్యుడు మెండు రాజమల్లు ఉన్నారు. కాగా, ఆలయంలో ఉదయం అమ్మవారికి అర్చకులు 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. ఆ తర్వాత మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. ఈఓ జి.సుదర్శన్, వేద పడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

### భానుడి భగభగతో తగ్గిన భక్తులు

భద్రాచలం: రాష్ట్ర, జిల్లా అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న శ్రీరామనవమి ఉత్సవాలు ఈ ఏడాది ప్రశాంతంగా జరగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. శ్రీరామనవమికి భక్తులు భారీగా హాజరవుతారని అధికారులు అంచనా వేసినా భానుడి ప్రతాపంతో ఆ స్థాయిలో రాలేదు. మంగళ, బుధ, గురువారాల్లో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత భద్రాచలంలో నమోదు కావడంతో భక్తులు భయపడ్డారు. ఇక భద్రాచలానికి అత్యధికంగా భక్తులు వచ్చే ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల హడావిడి కూడా మరో కారణంగా భావిస్తున్నారు. తెలంగాణలో ఎన్నికల కోడ్ ఉండడంతో సీఎం, మంత్రులు భారీగా హాజరు కాలేదు. డిప్యూటీ సీఎంతో పాటు ఇద్దరు మంత్రులు మాత్రమే రాగా.. వారు కూడా వీవీఐపీ సెక్టార్‌లోనే కూర్చున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ లేకపోవడం, ఎక్కువగా హాజరు కాకపోవడంతో వారి అనుచరుల హడావుడి సైతం తగ్గింది. కాగా గురువారం జరిగిన పట్టాభిషేక మహోత్సవంలో రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ మాత్రమే పాల్గొన్నారు. అయన పర్యటన సైతం విజయవంతం కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక ఈ ఏడాది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయం చాలా మందకొడిగా సాగింది. వీటికి సంబంధించిన పూర్తి వివరాలు మరో రెండు రోజుల్లో లభించే అవకాశం ఉంది.

### ఆన్‌లైన్‌లో సీఎంపీఎఫ్ క్లెయిమ్‌ల పరిష్కారం

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గుగని కార్మికుల సీఎంపీఎఫ్ క్లెయిమ్‌లను ఆన్‌లైన్‌లో పరిష్కరించేలా మాడ్యూల్ రూపకల్పనపై సంస్థ ఉన్నతాధికారులు గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో సమావేశమయ్యారు. సీఎండీ ఎన్.బలరామ్, డైరెక్టర్ ఎన్వీకే.శ్రీనివాసులు హాజరుకాగా, ఆన్‌లైన్ ద్వారా సెటిల్‌మెంట్ కోసం మాడ్యూళ్ల రూపకల్పన తదితర అంశాలపై చర్చించారు. ఈ విధానం అమల్లోకి వస్తే క్లెయిమ్‌లు త్వరగా పరిష్కారమవుతాయని, నేరుగా వేతనం నుంచి వాటా రికవరీ చేయొచ్చని తెలిపారు. ఈ సమావేశంలో సింగరేణితో పాటు ఇతర శాఖల అధికారులు సుదర్శన్, హరిపచౌరి, కట్టా బసవయ్య, హన్మంతరావు, రాంకుమార్‌రావు, ఎం.సుబ్బారావు, మోహిత్ వేద్, ఎం.సిద్ధార్థ, ఎం.కనకమ్మ, కోడూరి శ్రీనివాస్‌రావు, నికోలస్, హరిశంకర్, ముకుంద సత్యనారాయణ పాల్గొన్నారు.

### ఆలయాల నిర్మాణానికి రూ.10లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దొరయ్య, ఝాన్సీరాణి

అశ్వాపురం: మండలంలోని మిట్టగూడెంలో వీరబ్రహ్మేంద్ర స్వామి, శివాలయాల నిర్మాణానికి భక్తులు భారీ విరాళం ప్రకటించారు. గ్రామానికి చెందిన చలపాటి దొరయ్య - ఝాన్సీరాణి దంపతులు రూ.10,01,116 విరాళాన్ని గురువారం ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులకు అందజేశారు. గతంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా ఇప్పుడు విరాళం అందజేసిన దొరయ్య దంపతులకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి కృష్ణప్రసాద్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజాధిరాజుగా రామయ్య



దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రంలో శ్రీరాముడి పట్టాభిషేకం గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రాలను అనుసరిస్తూ నిర్వహించిన ఈ వేడకకు రాష్ట్ర ప్రథమ పౌరుడు, గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై శ్రీరాముడికి పట్టువస్త్రాలు సమర్పించారు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

**భద్రాద్రి రాముడికి శాస్త్రోక్తంగా పట్టాభిషేకం**

- రాజదండం, రాజముద్రిక, స్వర్ణ ఖడ్గాలకు పూజలు
- మంత్రించిన జలప్రోక్షణతో పట్టాభిషిక్తుడైన స్వామివారు
- చివరన శ్రీ ఆంజనేయ స్వామికి పట్టాభిషేకం
- వేడుకకు హాజరైన గవర్నర్ రాధాకృష్ణన్



పట్టాభిషేక క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు (ఇన్‌సెట్) కిరీటాన్ని చూపిస్తున్న అర్చక స్వామి



స్వామి వారికి వస్త్రాలు సమర్పిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్

**ఆలయం నుంచి అయోధ్యాపురికి..**

పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని సీతాసమేతుడైన శ్రీరాముడు లక్ష్మణుడిని తోడుగా తీసుకుని ప్రధాన ఆలయం నుంచి అయోధ్యపురి (మిథిలా స్టేడియం)కి పల్లకీలో భక్తుల కోలాహలం నడుమ బయలుదేరి, మాడ వీధులు గుండా ఉదయం 10:30 గంటలకు వేదికపైకి చేరుకున్నారు. అక్కడ అర్చకులు ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత శ్రీరాముడికి పట్టాభిషేకం చేసేందుకు వీలుగా వేద పండితులు రుత్విక్కులైన వశిష్టుడు, వామదేవుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, విజయుడు, సూయజ్ఞుడిని ఆవాహన చేసుకున్నారు. వీరందరికీ నేతృత్వం వహించే వాల్మీకిని మరొకరికి ఆవాహన చేశారు.

**మండప్రతయ ఆరాధన..**

రుత్విక్కరణం తర్వాత పండితులు మండపత్రయ పూజలు ప్రారంభించారు. శ్రీరాముడి పట్టాభిషేకానికి సమస్త దేవతలు, సమస్త నదీ, సముద్ర జలాలతో పాటు రామపరివారాన్ని ఆవాహన చేయడం ఈ మండపత్రయ ఆరాధన ప్రధాన ఉద్దేశం. పట్టాభిషేకం వేదిక దిగువ భాగంలో మూడు కలశాలను ఏర్పాటు చేశారు. మధ్య కలశంలో సముద్ర జలాలు, నదీ జలాలను ఆవాహన చేశారు. ప్రధానంగా తూర్పున పూరీ, దక్షిణాన ధనుష్కోటి, పశ్చిమాన ద్వారకలకు చెందిన సముద్ర జలాలు అవాహన చేయగా ఆగ్నేయం నుంచి గంగా, నైరుతి నుంచి కృష్ణా, వాయువ్యం నుంచి గోదావరి, ఈశాన్యం నుంచి కావేరీ నదీ జలాలను ఆవాహన చేశారు. నదీ, సముద్ర జలాలను ఆవాహన చేసిన కలశానికి కుడివైపున ఉన్న కలశంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పాటు రామపరివారాన్ని ఆవాహన చేశారు. తూర్పున హనుమ, పడమరన లక్ష్మణ, ఉత్తరాన శత్రుఘ్నుడు, దక్షిణాన భరతుడు, ఆగ్నేయంలో అంగధుడు, వాయువ్యంలో సుగ్రీవుడు, ఈశాన్యంలో విభీషణుడు, నైరుతిలో జాంబవతుడిని ఆవాహన చేశారు. ఎడమ వైపు కలశంలో అష్టదిక్పాలకులను ఆవాహన చేశారు. ఇదే సమయంలో పట్టాభిషేకంలో రాజముద్రికలో లక్ష్మీదేవిని, రాజదండంలో విశ్వక్సేనుడిని, చామరలో వైనతేయుడు, గరుత్మంతుడు, ఖడ్గంలో నందకుడు, స్వర్ణఛత్రంలో అనంతుడు, పాదుకల్లో ఆదిశేషుడు, దేవేరులు ధరించే ఆభరణాల్లోకి భూదేవిని ఆవాహన చేశారు. మండపత్రయ ఆరాధాన ముగిసిన తర్వాత శ్రీరాముడికి అష్టోత్తర శతనామార్చన చేశారు. అనంతరం త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి ఆనాటి శ్రీరాముడి పాలన విశిష్టతను వివరించారు.

**శ్రీరాముడికి అలంకరణలు..**

పట్టాభిషేకత్సోవంలో శ్రీరాముడి అలంకణ కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు మొదలైంది. ముందుగా రాజదండాన్ని స్వామివారి కుడిచేతిలో ఉంచారు. ఆ తర్వాత రాజముద్రిక తొడిగారు. అనంతరం రామదాసు చేయించిన పచ్చల పతకాన్ని శ్రీరాముడికి, చింతాకు పతకాన్ని సీతాదేవికి, రామమాడను లక్ష్మణుడికి అలంకరించారు. స్వామివారికి ఇరువైపులా చామరాలు ఉంచి, స్వర్ణ ఛత్రాన్ని, ఎడమ చేతిలో రాజఖడ్గాన్ని ధరింపజేశారు.

**సిరియ తిరువడి పట్టాభిషేకం**

వాల్మీకి రామయాణంలో పట్టాభిషేకానికి ముందు రోజు శ్రీరాముడు అయోధ్యను వదిలి వనవాసానికి వెళ్లారు. దీంతో ముందుగా రాముడి పాదుకలకు పట్టాభిషేకం జరిగింది, ఆ తర్వాత క్రమంలో సుగ్రీవుడికి, విభీషనుడికి, ఆ తర్వాతే శ్రీరాముడికి పట్టాభిషేకాలు జరిగాయి. విష్ణువుకు అన్ని అవతారాల్లో గరుత్మంతుడు సేవలు అందించడంతో ఆయనను పెరియ తిరువడిగా, ఒక్క రామావతారంలోనే సేవలందించిన ఆంజనేయుడిని సిరియ తిరువడిగా కొలుస్తారు. శ్రీరాముడి పాదుకలతో మొదలైన పట్టాభిషేక మహోత్సవం హనుమంతుడి పట్టాభిషేకంతో పూర్తయింది.

**పట్టాభిషేకం..**

స్వర్ణ ఛత్రం నీడలో రాజముద్రిక, రాజదండం, రాజఖడ్గం ధరించిన తర్వాత శ్రీరాముడికి పట్టాభిషేకం కార్యక్రమాన్ని మధ్యాహ్నం 12:17 గంటలకు ప్రారంభించారు. మండపత్రయంలోని మూడు కలశాల్లోని సమస్త దేవతలు, సమస్త జలాలు, రామపరివారంతో కూడిన మంత్రించిన జలాన్ని శ్రీరాముడిపై ప్రోక్షణ చేస్తూ పట్టాభిషేకం కార్యక్రమాన్ని జరిపించారు. 12:25 గంటలకు మంగళ హారతి సమర్పించారు.

**హనుమాన్ పట్టాభిషేకం..**

పట్టాభిషేకం పూర్తయిన తర్వాత శ్రీరాముడికి ముత్యాల దండను ధరింపచేశారు. ఈ ముత్యాలదండను శ్రీరాముడు, సీతాదేవి మెడలో ధరింపచేశారు. చివరకు అదే దండను ఆంజనేయుడి మెడలో సీతమ్మ ధరింపజేస్తున్నట్టుగా.. ఆంజనేయుడి మెడలో వేసి పట్టాభిషేకం చేశారు. దీంతో శ్రీరామ పట్టాభిషేక వేడుక ముగియగా.. స్వామివారిని పల్లకీలో ఆలయానికి తీసుకెళ్లారు.

**పట్టు వస్త్రాలు సమర్పించిన గవర్నర్..**

శ్రీరాముడి పట్టాభిషేకానికి గవర్నర్ రాధాకృష్ణన్ హాజరై రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు ఆయన ప్రధాన ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కంచి కామకోటి, త్రిదండి జీయర్ మఠం, అహోబిల మఠం తరఫున, ఐటీడీఏ పీఓ, తూము నరసింహదాసు వంశీయులు కూడా పట్టు వస్త్రాలు సమర్పించారు.



పట్టాభిషేకం అనంతరం స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

### వైభవంగా రథోత్సవం

భద్రాచలం: పట్టాభిషిక్తుడైన శ్రీ సీతారామచంద్రస్వామి వారికి గురువారం రాత్రి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారి ఉత్సవ మూర్తులను రథంలో కొలువుదీర్చి భక్తుల జయజయ ధ్వానాలు, శ్రీరామనామస్మరణల నడుమ తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ జరిపారు. తమ ఇంటిముందుకు వచ్చిన స్వామివారిని భక్తులు హారతులతో స్వాగతం పలికారు. 'రథస్థం రాఘవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే' అని బ్రహ్మ పురాణం చెబుతోందని, రథోత్సవంలో శ్రీరాముడిని సేవించిన వారికి ముక్తి లభిస్తుందని స్థల పురాణం చెబుతోందని అర్చకులు వివరించారు.

**ఉత్సవాల విజయవంతంపై హర్షం**

భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాల విజయవంతంపై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ ప్రియాంక ఆల హర్షం వ్యక్తం చేశారు. ఇందుకోసం కృషి చేసిన అధికారులు, సిబ్బందికి, సహకరించిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయడం వల్లే వేడుకలు వైభవోపేతంగా జరిగాయని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విధులు నిర్వర్తించారని అభినందించారు. అన్ని విధాలా సహకరించిన మీడియాకు, భక్తులకు తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదం ఉచితంగా అందజేసిన స్వచ్ఛంద సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు.

**హాజరైన ప్రముఖులు..**

భద్రాచలంఅర్బన్ : భద్రాచలంలో గురువారం జరిగిన పట్టాభిషేక మహోత్సవానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వారిలో గవర్నర్ రాధాకృష్ణన్‌తో పాటు హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్, దేవాదాయ శాఖ ప్రత్యేక కమిషనర్ ఎం.హనుమంతరావు, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, జైళ్ల శాఖ ఐజీ వై.రాజేశ్, కలెక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు ఉన్నారు.

# పోరు షురూ..



కేసీఆర్ నుంచి 'బీ' ఫామ్ అందుకుంటున్న ఎంపీ నామ, పక్కన ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ మధు, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తదితరులు

- లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- తొలిరోజు ఒక నామినేషన్ దాఖలు
- బీ ఫాం అందుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు
- నేడు బీజేపీ ర్యాలీకి హాజరుకానున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పార్లమెంట్ ఎన్నికల పోరు మొదలైంది. ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి వీ.పీ.గౌతమ్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేయగా నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. తొలిరోజు ఒక నామినేషన్ దాఖలు కాగా.. మిగతా అభ్యర్థులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రధాన పార్టీలు భారీ ర్యాలీగా తమ అభ్యర్థులతో నామినేషన్ దాఖలు చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేశాయి. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల నామినేషన్ తేదీలు ఖరారు కాగా, కాంగ్రెస్ అభ్యర్థిని పార్టీ అధిష్టానం ప్రకటించాల్సి ఉంది.

**ప్రక్రియ సజావుగా సాగేలా..**

అభ్యర్థుల నామినేషన్లను ఖమ్మం కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల అధికారి గౌతమ్ స్వీకరిస్తున్నారు. ఈనెల 25 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, ప్రక్రియ సజావుగా సాగేలా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఆర్ఓ, ఏఆర్ఓ కార్యాలయాల్లో నామినేషన్ పత్రాలను అందుబాటులో ఉంచగా, అభ్యర్థుల సందేహాలు నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. అలాగే, పోలీసులు సైతం చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు.

**నేడు తాండ్ర.. 24న నామ**

తొలిరోజు ఆధార్ పార్టీ అభ్యర్థి కుక్కల నాగయ్య నామినేషన్ దాఖలు చేయగా.. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు శుక్రవారం ఉదయం 11.30 గంటలకు నామినేషన్ వేయనున్నారు. ఆ తర్వాత ఖమ్మంలో నిర్వహించే భారీ ర్యాలీకి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్ ద్వారా మధ్యాహ్నం 2.40 గంటలకు రాజ్‌నాథ్‌సింగ్ ఖమ్మంలోని పటేల్ స్టేడియానికి చేరుకుంటారు. అక్కడి నుంచి టూ టౌన్ పోలీస్‌స్టేషన్, జెడ్పీ సెంటర్, మయూరిసెంటర్ మీదుగా పెవిలియన్ గ్రౌండ్ వరకు నిర్వహించే ర్యాలీలో పాల్గొని, ప్రసంగం అనంతరం హెలీకాప్టర్‌లో విజయవాడ వెళ్తారు. ఇక ఈనెల 24న నామినేషన్ దాఖలు చేసేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి గురువారం ఆయన బీ ఫామ్ అందుకున్నారు.

**కాంగ్రెస్‌లో అదే ఉత్కంఠ**

ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనా అభ్యర్థిని ప్రకటించకపోవడంతో కార్యకర్తలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పటికే ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నియమించారు. అలాగే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు అభ్యర్థి తరఫున ప్రచారంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**మొదలైన సందడి**

పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలతో పార్టీల్లో సందడి మొదలైంది. ఇప్పటి వరకు అడపాదడపా ప్రచారం చేస్తున్న అభ్యర్థులు ఇక నుంచి ముమ్మరం చేయాలని నిర్ణయించారు. బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను ముందుగానే ప్రకటించడంతో ఓ విడత ప్రచారాన్ని పూర్తి చేశారు. ఇన్నాళ్లు కార్యకర్తలతో భేటీలకే ఎక్కువ సమయం వెచ్చించగా.. మిగిలిన 22 రోజుల్లో ప్రచారానికి షెడ్యూల్ రూపొందించుకుంటున్నారు. అలాగే, అభ్యర్థుల తరఫున ప్రజాదరణ కలిగిన నేతలను ప్రచార రంగంలోకి దింపేందుకు కసరత్తు మొదలైంది.

# పారదర్శకంగా ఎన్నికల వ్యయపరిశీలన

**జిల్లాకు చేరిన ఇద్దరు వ్యయ పరిశీలకులు**

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల వ్యయ పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణస్వామి, శంకర నంద్ మిశ్రా సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం వీరిని ఖమ్మం పార్లమెంట్ స్థానానికి పరిశీలకులుగా నియమించగా గురువారం ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ స్వాగతం పలకగా, కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం, మీడియా సర్టిఫికేషన్ – మీడియా మానిటరింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ చేసిన ఏర్పాట్లు, నియమించిన బృందాలను తెలుసుకుని పలు సూచనలు చేశారు. కాగా, గురువారం నాటికి సీ-విజిల్ యాప్ ద్వారా 38 ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు 64 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు.

**పకడ్బందీగా ఈవీఎంల రవాణా**

లోక్‌సభ ఎన్నికలకు గాను ఈవీఎంల రవాణా విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశమై మాట్లాడారు. కలెక్టరేట్ ఆవరణలోని గోదాం నుంచి నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను తరలించేందుకు వాహనాల ఏర్పాట్లు, రవాణాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మ్రినాల్ శ్రేష్ఠ, డీఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్, సీపీఓ శ్రీనివాస్, డీఆర్వో రాజేశ్వరి, ఆర్టీఓ ఆఫ్రిన్ సిద్దిఖీ, ట్రెజరీ డీడీ సత్యనారాయణ, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం పవిత్ర, ఉద్యోగులు అరుణ, వరప్రసాద్, వెంకటరమణ, మదన్‌గోపాల్, రాంబాబు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ఉద్యోగులు

- భద్రాచలంలో పట్టుబడిన టౌన్ ఎస్సై
- చోరీ కేసులో నిందితులను తప్పించేందుకు లంచం డిమాండ్
- పాల్వంచలో వలకు చిక్కిన మున్సిపల్ ఉద్యోగి



ఏసీబీకి పట్టుబడిన భద్రాచలం టౌన్ ఎస్సై శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకర్, ఆపరేటర్ నవీన్



పాల్వంచలో పట్టుబడిన టీపీఎస్ వెంకరమణి, ప్రసన్నతో ఏసీబీ డీఎస్పీ రమేశ్, అధికారులు

భద్రాచలంఅర్బన్/పాల్వంచ: జిల్లాలో వేర్వేరు చోట్ల ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఒకేరోజు జరిగిన ఈ ఘటనలతో ప్రభుత్వ ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. భద్రాచలంలో చోరీ కేసులో గుర్తించిన వారిని కేసు నుంచి తప్పించేందుకు లంచం డిమాండ్ చేస్తూ టౌన్ ఎస్సై సహా ఓ కానిస్టేబుల్, సీసీ కెమెరా ఆపరేటర్ ఏసీబీకి చిక్కారు. ఇక పాల్వంచలో ఎల్ఆర్ఎస్ అనుమతి జారీ చేసేందుకు డబ్బు తీసుకుంటున్న మున్సిపల్ మహిళా ఉద్యోగిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**చోరీ కేసు నుంచి తప్పిస్తామని..**

భద్రాచలానికి చెందిన మర్రి సాయితేజ, ఆయన ఇద్దరు స్నేహితులు ఈనెల 12న ఓ గోదాంలో నాలుగు బస్తాల పంచదారను దొంగతనం చేసి ఆటోలో తరలించారు. ఈ సమయాన టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న కానిస్టేబుల్ శంకర్ ఈ విషయాన్ని గుర్తించి ఎస్ఐ శ్రీనివాస్‌కు తెలిపారు. ఆ మరుసటి రోజు ముగ్గురిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఆటో, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పు ఇస్తే ఆటో, సెల్‌ఫోన్లు వదిలేస్తామని చెప్పగా అంత ఇవ్వలేమని బతిమిలాడినా వినలేదు. దీంతో సాయి, ఆయన స్నేహితులు ఈనెల 15న ఖమ్మం ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయితే, సాయితేజను మరోమారు పిలిపించిన ఎస్సై డబ్బు ఇవ్వాలని సూచించాడు. ఇక చేసేదేం లేక గురువారం సాయంత్రం ముగ్గురూ కలిసి రూ.20 వేలు ఇచ్చేందుకు స్టేషన్‌కి వెళ్లగా ఆ సమయంలో ఎస్ఐ శ్రీనివాస్ లేరు. దీంతో కానిస్టేబుల్ శంకర్‌కు నగదు అందించారు. అప్పటికే స్టేషన్ పరిసరాల్లో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యాన మాటువేసిన వేసిన అధికారులు శంకర్‌ను అదుపులోకి తీసుకోగా, ఎస్ఐ శ్రీనివాస్, సీసీ కెమెరాల ఆపరేటర్ నవీన్ (ప్రైవేట్) సైతం లొంగిపోయారు. వీరిపై కేసు నమోదు చేసి వరంగల్ కోర్టుకు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. దాడుల్లో ఏసీబీ సీఐలు శ్యాంసుందర్, రాజు, మహేష్ పాల్గొన్నారు. కాగా, భద్రాచలం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ రమేష్ ఇటీవల గంజాయి అమ్మకాల కేసులో పట్టుబడగా.. ఇప్పుడు ఎస్సై, కానిస్టేబుల్ అవినీతి కేసులో ఇరుక్కోవడం చర్చనీయాంశంగా మారింది.

**రూ.15 వేలు తీసుకుంటూ మున్సిపల్ ఉద్యోగి..**

ఎల్ఆర్ఎస్ అనుమతికి లంచం డిమాండ్ చేసిన పాల్వంచ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ లక్కిరెడ్డి వెంకటరమణి ఏసీబీ అధికారులకు చిక్కారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం డబ్బులు తీసుకుంటుండగా ఆమెతో పాటు సహాయకుడు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రసన్నకుమార్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కాంపెల్లి కనకేశ్ కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపాన మూడు ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ అనుమతుల కోసం మూడు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకోసం ప్లాట్‌కు రూ.10వేల చొప్పున ఇవ్వాలని ప్రసన్నకుమార్‌తో టీపీఎస్ వెంకటరమణి అడిగించింది. చివరకు మూడింటికి కలిపి రూ.15 వేలు ఇస్తానని కనకేష్ ఒప్పుకోగా.. అన్నీ సక్రమంగా ఉన్నా లంచం ఇవ్వడం ఇష్టం లేక ఖమ్మం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో డీఎస్పీ వై.రమేశ్ సూచన మేరకు గురువారం పాల్వంచ మున్సిపాలిటీలో వెంకటరమణికి డబ్బు ఇవ్వబోగా ఆమె డెస్క్‌లో పెట్టాలని సూచించింది. అనంతరం కనకేష్ బయటకు వెళ్లిపోగా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి వెంకటరమణి, ప్రసన్నకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు సునీల్, శేఖర్, రామారావు పాల్గొన్నారు.

స్వామి వారి పాదుకలు చూపుతున్న అర్చకులు



రాజదండం



● రాజముద్ర



● ఛత్రం



● ముత్యాల హారం



● ఖడ్గం

# నయనానందకరం!

■ భద్రగిరిలో వేడుకగా శ్రీరామ పట్టాభిషేకం ■ దర్శించి పులకించిన భక్తజనం

భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో శ్రీసీతారామచంద్ర స్వామి పట్టాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చక స్వాములు పట్టాభిషేకం ప్రత్యేకతలను వివరిస్తూ స్వామి వారి ఆయుధాలు, ఇతర ఆభరణాలను ప్రదర్శించారు. గవర్నర్ రాధాకృష్ణన్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించగా.. తెలంగాణ, ఏపీకి చెందిన వేలాది మంది భక్తులు పట్టాభిషేక మహోత్సవాన్ని కనులారా తిలకించి పులకించిపోయారు. భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఆలయ ఈఓ రమాదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



కంచి కామకోటి పీఠం తరఫున పట్టువస్త్రాలు అందచేస్తున్న శ్రీపాద శ్రీకర్



స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్, ఆలయ ఈఓ రమాదేవి



స్వామి పల్లకీ సేవలో దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఈఓ రమాదేవి







గవర్నర్ రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్ (కుడివైపు నుంచి)

# కేసీఆర్ స్థాయికి తగ్గ వ్యాఖ్యలు కావు..

● కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందనుకోవడం కలే..
● రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే కనకయ్య తదితరులు

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలు, ఆరు నెలల్లోనే కూలిపోతుందని.. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలో కలుస్తాడని మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించడం ఆయన స్థాయికి తగదని, కేసీఆర్‌ను పదవీ జబ్బు పీడిస్తుండడంతోనే అలా మాట్లాడుతున్నారని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. ఇల్లెందులో గురువారం నిర్వహించిన మహబూబాబాద్ పార్లమెంట్ పరిధి మహిళా నాయకులు సమావేశంలో మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్‌ను గెలిపించుకోవడం ద్వారా పేదలు, కష్టజీవుల రాజ్యం వచ్చిందని తెలిపారు. అయితే, బీఆర్ఎస్ నేతలు మాత్రం మళ్లీ వారే వస్తామని చెబుతున్నారని.. ఇలాంటి కలలు కనడం తప్పు కాకున్నా సాకారమయ్యే కలలు కనాలని హితవు పలికారు. బీఆర్ఎస్‌కు ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థులే దొరకడం లేదని ఎద్దేవా చేశారు. పసిపాప వంటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోస్తామంటున్న బీఆర్ఎస్ తీరును ప్రజలు గమనించాలని కోరారు. కాగా, మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యే అవకాశమొస్తుందని చెప్పారు. కాగా, మహబూబాబాద్‌లో శుక్రవారం జరిగే బలరాంనాయక్ ఎన్నికల నామినేషన్, సీఎం సభను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఇక బీజేపీకి బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందం చేసుకుందని విమర్శించారు.

## ఎండలకు కారణం మేమా..?

వర్షాభావం వల్ల భూగర్భ జలాలు అడుగంటితే కాంగ్రెస్సే కారణమని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారని మంత్రి తుమ్మల మండిపడ్డారు. ఎండాకాలంలో ఎండలు కాకపోతే ఏమొస్తాయని ప్రశ్నించారు. వర్షాకాలంలో ప్రాజెక్టులు నింపని బీఆర్ఎస్సే ఇప్పటి పరిస్థితికి కారణమని విమర్శించారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, నాయకులు రవి, వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, డానియేల్, పులి సైదులు, యదళ్లపల్లి అనసూర్య, మోకాళ్ల వెంకటమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు. తొలుత మంత్రి తుమ్మలకు వివిధ పార్టీల నాయకులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

## క్లుప్తంగా

### మంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు



మంత్రి తుమ్మలతో సమావేశమైన ఎమ్మెల్యేలు

దమ్మపేట: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, జారె ఆదినారాయణ గురువారం కలిశారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని మంత్రి తుమ్మల నివాసంలో కలిసినవారు పలు అంశాలపై చర్చించారు. అనంతరం మండలంలోని దురదపాడులో జరుగుతున్న అంకమ్మ తల్లి తిరునాళ్లకు హాజరు కావాలని కోరుతూ మంత్రి, ఎమ్మెల్యేలకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రాలు అందజేశారు. ఎంపీపీ సోయం ప్రసాద్, నాయకులు కాసాని నాగప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, యర్రా వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యసేవలు



ఉద్యోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

భద్రాచలంటౌన్: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులను తీసుకొచ్చిన ఆర్టీసీ ఉద్యోగుల కోసం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. రెండు రోజుల పాటు కొనసాగిన ఈ శిబిరంలో తెలంగాణ, ఏపీ ఆర్టీసీ ఉద్యోగులు 200మందికి వైద్య సేవలు అందించినట్లు ఆర్టీసీ సీనియర్ వైద్యాధికారి గిరిసంహారావు తెలిపారు. అంతేకాకుండా ఉద్యోగులు వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశామని వెల్లడించారు.

### 28న 'ఏకలవ్య' ప్రవేశపరీక్ష

దమ్మపేట: దమ్మపేట మండలం గండుగులపల్లిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 28న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అందులోని సూచనల ఆధారంగా నిర్ణీత సమయానికి ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని తెలిపారు.

### ఉపాధ్యాయుడి గైర్హాజరు.. నిలిచిన పరీక్ష



విద్యార్థులతో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, స్థానికులు

ములకలపల్లి: ఉపాధ్యాయుడు గైర్హాజరు కావడంతో విద్యార్థులకు వార్షిక పరీక్ష నిలిచిపోయిన ఘటన మండలంలోని అనందపురం పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉండగా, ఉపాధ్యాయుడు ఎల్.కృష్ణ ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం ఆయన ఎవరికీ సమాచారం ఇవ్వకుండా పాఠశాలకు డుమ్మా కొట్టాడు. దీంతో స్థానికులు కాంప్లెక్స్ హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లుకు సమాచారం అందించగా ఆయన పాఠశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయుడు కృష్ణ ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా, సెలవు పెట్టకుండా విధులకు ఎగనామం పెట్టినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

# ఎండ వేడికి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

● కారేపల్లి మండలంలో ఘటన
● ఇంకొన్ని ప్రాంతాల్లోనూ అగ్ని ప్రమాదాలు
● పలుచోట్ల భారీగా ఆస్తినష్టం



కారేపల్లి : సూర్యతండాలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

కారేపల్లి: భానుడి ప్రతాపానికి ఓ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఈ సమయాన పెద్దశబ్దంతో మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కారేపల్లి మండలం సూర్యతండా నుంచి ఎన్‌టీఆర్ నగర్‌కు వచ్చే మార్గంలో వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా చేసే 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గురువారం మధ్యాహ్నం తీవ్ర ఉష్ణోగ్రతతో వేడెక్కిన ట్రాన్స్‌ఫార్మర్ మంటలు అలుముకుని పెద్దశబ్దంతో కాలిపోయింది. ఇదేసమయాన ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే మాలోతు మునిరామ్‌కు చెందిన గడ్డివాముకు సైతం మంటలు అంటుకుని దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినా ఆలస్యం కావడంతో యువకులు గ్రామపంచాయతీ వాటర్‌ట్యాంకర్‌తో నీళ్లు చల్లి మంటలు ఆర్పారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి అధిక వేడి కారణంగానే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని తెలిపారు.

● సత్తుపల్లిరూరల్: మండలంలోని బేతుపల్లి ఎస్టీ కాలనీకి చెందిన దుంప వెంకమ్మ ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గురువారం తెల్లవారుజామున కాలిపోయింది. వెంకమ్మ రేకులతో ఇల్లు ఏర్పాటు చేసుకోగా చుట్టూ తడికలు కట్టుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ఇల్లు పూర్తి కాలిపోగా రూ.5వేల నగదు, టీవీ, ఫ్యాన్, వంట సామాగ్రి కాలిపోవడంతో రూ.50వేలు నష్టం జరిగినట్లు బాధితురాలు వాపోయింది. ఈమేరకు ఆర్ఐ నరేష్ పరిశీలించి ప్రభుత్వం తరఫున 20కేజీల బియ్యం అందజేశారు.

● నేలకొండపల్లి: చెత్తకు కావాలనే నిప్పు పెట్టారో, ప్రమాదవశాత్తు అంటుకుందో తెలియదు కానీ ఆ మంటలు పెట్రోల్ బంక్ వైపు దూసుకొస్తుండడంతో ఆందోళన నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు... మండలంలోని కొత్తకొత్తూరు పంట పొలాల్లో గురువారం చెత్తకు నిప్పంటుకుంది. ఎలా నిప్పంటుకుందో తెలియకున్నా వేగంగా వీస్తున్న గాలులతో మంటలు సమీపంలోని పెట్రోల్ బంక్ వైపు దూసుకొచ్చాయి. ఇంతలోనే స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది రెండు ఫైరింజన్లతో చేరుకుని తొలుత ఆ ప్రాంతమంతా నీళ్లు చల్లారు. ఆపై గంట పాటు శ్రమించి మంటలను అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇక మండలంలోని బోదులబండలో ప్రమాదవశాత్తు వరి గడ్డి దగ్ధమైంది. గ్రామంలో తుమ్మా సత్యంకు చెందిన గడ్డి వాముకు నిప్పంటించుకోగా 100 దిండ్లు కాలిపోయాయి.

● రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి, మంచుకొండ గ్రామాల్లో గురువారం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదాలతో సుమారు 45 ఎకరాల్లోని సుబాబుల్ తోటలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రూ.కోటి వరకు నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు. మధ్యాహ్నం సమయంలో తోటలకు మంటలు అంటుకోగా వేడిగాలులకు వేగంగా వ్యాపించి తోటలు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. మంచుకొండకు చెందిన యల్లంపల్లి హన్మంతరావు, శరణ్, శోభారాణి, చంద్రశేఖర్, కొనకంచి శ్రీనివాసరావు, మల్లెంపాటి వెంకటేశ్వర్లు, చిమ్మపూడిలో చింతపల్లి నారాయణ, పుల్లయ్య తోటలు కాలిపోగా బాధితుల రైతుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ శ్రీహరి తెలిపారు. కాగా, చిమ్మపూడిలో ఓ రైతు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా మిర్చి కంపకు మంట పెట్టడంతో ప్రమాదం జరిగిందని సమాచారం.

# నేడు మహబూబాబాద్‌కు సీఎం

ఎన్నికల ప్రచార సభలో పాల్గొననున్న రేవంత్‌రెడ్డి



మహబూబాబాద్ ఎన్‌టీఆర్ స్టేడియంలో సిద్ధమవుతున్న సభావేదిక

సాక్షి, మహబూబాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం మహబూబాబాద్ రానున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన పార్లమెంట్ ఎన్నికల ప్రచార నిమిత్తం జిల్లాకు వస్తున్నారు. కాగా, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ ఉదయం నామినేషన్ దాఖలు చేస్తారు. సాయంత్రం 4గంటలకు మహబూబాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరిగే బహిరంగ సభకు సీఎం హాజరై ప్రసంగించనున్నారు. ఆతర్వాత 6గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్ బయలుదేరతారు. కాగా, మూడు రోజులుగా సభ ఏర్పాట్లను సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు. గురువారం సైతం మంత్రి తుమ్మల జిల్లా పోలీస్ అధికారులతో కలిసి సభా వేదిక, హెలీపాడ్‌ను పరిశీలించారు. కాగా, ఎండ తీవ్రత నేపథ్యాన బహిరంగ సభకు జనసమీకరణ స్థానిక నాయకులకు సవాల్‌గా మారింది. గతంలో మాదిరి ప్రజలు సభలకు వచ్చే పరిస్థితి లేదని, వారికి అన్ని ఏర్పాట్లు చేస్తేనే వస్తారని పలువురు నాయకులు చెబుతున్నారు.

# మోడీ గ్యారంటీలపై ప్రజల్లో విశ్వాసం

● బీజేపీ ఖమ్మం అభ్యర్థి వినోద్‌రావు
● నేడు ర్యాలీకి హాజరుకానున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: మరోమారు నరేంద్రమోడీ ప్రధానమంత్రి కావడం ఖాయమని.. మోడీ గ్యారంటీలపై పల్లె, పట్టణ ప్రజల్లో ఉన్న విశ్వాసమే తమ గెలుపునకు నాంది అని బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు వెల్లడించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ పరిధిలోని పట్టణ, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఇప్పటికే విస్తృతంగా ప్రచారం చేయగా, ప్రజలు మోడీకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తేలిందని చెప్పారు. మోడీ ప్రధాని అయ్యాకే దేశ ప్రతిష్ట పెరిగిందని, అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగిందని తెలిపారు. దేశం రామరాజ్యంలా ఉండాలన్నా, అభివృద్ధిలో ముందుకు సాగాలన్నా మోడీ నాయకత్వం అవసరం కావడంతో ఖమ్మంలో కూడా ప్రజలు బీజేపీకి పట్టం కడతారన్న నమ్మకం ఉందని చెప్పారు. కాగా, తాను శుక్రవారం నామినేషన్ వేయనుండగా.. ఖమ్మం లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పటేల్ స్టేడియం నుంచి టూటౌన్ పోలీస్ స్టేషన్, జెడ్పీ సెంటర్, మయూరి సెంటర్, పెవిలియన్ గ్రౌండ్ వరకు ర్యాలీ సాగుతుందని.. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ర్యాలీలో పాల్గొని ప్రసంగిస్తారని వెల్లడించారు. అంతేకాక ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, పార్టీ నేతలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి హాజరవుతున్నందున ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటేస్తే వృథా అవుతుందని, పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించారు. జిల్లా ప్రజలు బీజేపీకి ఓటు వేయకున్నా.. కేంద్రం మాత్రం నిధుల వరద పారించిందని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, వీరెల్లి లక్ష్మయ్య, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, శ్యాంరాథోడ్, చావా కిరణ్, బోళ్ల భిక్షపతి పాల్గొన్నారు.

# రామయ్య పట్టాభిషేకానికి వెళుతూ..



ప్రమాదస్థలంలో చక్రపాణి మృతదేహం

చండ్రుగొండ : భద్రాచలంలో జరిగే సీతారాముల పట్టాభిషేకానికి బయలుదేరిన ఓ భక్తుడు చండ్రుగొండ మండలం అయ్యన్నపాలెం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని విజయవాడకు చెందిన రిటైర్డ్ టీచర్ అత్మూరు శ్రీకృష్ణ చక్రపాణి (60) పట్టాభిషేకానికి వెళ్లేందుకు గురువారం తెల్లవారుజామున స్కూటీపై బయలుదేరాడు. అయన్నపాలెం మలుపు వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ స్కూటీని ఢీకొట్టింది. లారీ అతడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే తుదిశ్వాస విడిచాడు. మృతుడి భార్య త్రయాదతి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## ఉపాధి పనులను అడ్డుకున్న పోడు రైతులు

అశ్వాపురం: మండలంలోని కొమ్ముగూడెం అటవీ ప్రాంతంలో కొన్నేళ్లుగా పోడు రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీ అధికారులు గురువారం ఉపాధి హామీ పథకంలో జామాయిల్ మొక్కలు నాటేందుకు పనులు ప్రారంభించారు. దీంతో స్థానిక పోడు రైతులు పనులను అడ్డుకున్నారు. రెండు రోజుల క్రితం పోడు రైతులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి సమస్య విన్నవించారు. కాగా, ఆయన సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భిక్షమయ్య పోడు భూముల వద్దకు చేరుకొని అధికారులు, పోడు రైతులతో మాట్లాడి సమస్య తీవ్రం కాకుండా సమన్వయం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ముగ్గురికి గాయాలు



రాములు (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని సాయిరాంతండా గ్రామ సమీపంలో తల్లాడ – కొత్తగూడెం ప్రధాన రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. సాయిరాంతండాకు చెందిన తేజావత్ చరణ్, అన్నారుపాడుకు చెందిన బానోత్ చందర్ బైక్‌పై జూలూరుపాడు వెళ్లి సాయిరాంతండాకు తిరిగి వస్తుండగా ఏన్కూరు మండలం భగవాన్ నాయక్‌తండాకు చెందిన ధరావత్ రాములు(38), గుగులోత్ నరేష్ మరో బైక్‌పై ఎదురుగా వస్తూ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ధరావత్ రాములు అక్కడికక్కడే మృతి చెందగా నరేష్, చరణ్, చందర్‌కు గాయాలయ్యాయి. రాములు ప్రాణంతో ఉన్నాడేమోనని పోలీసులు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాయపడిన నరేష్‌ను కొత్తగూడెం ఆస్పత్రికి, చరణ్, చందర్‌ను జూలూరుపాడులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కారు ఢీకొని యువకుడు...

మరొకరికి తీవ్ర గాయాలు




రాము (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరో యువకుడు గాయపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని శివయ్య బజార్‌కు చెందిన లోకాల రాము(19) బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. గురువారం స్నేహితుడు జీళ్ల భానుతో కలిసి ఊట్లపల్లి శివారులోని వెంకమ్మ చెరువు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం రాజీవ్ నగర్‌కు చెందిన కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. రామును కారు కొద్ది దూరం ఈడ్చుకెళ్లగా, పొట్ట భాగంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. భానుకు చేయి విరిగింది. స్థానికులు భానును అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రాము మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి తిరుపతిరావు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## చికిత్స పొందుతున్న వృద్ధుడు..

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు కథనం ప్రకారం.. స్థానిక కోతమిషన్‌బజార్‌కు చెందిన కూలీ బమ్మిడి సాంబయ్య (62)కి కడుపులో పదిహేనేళ్ల క్రితం కణితి రాగా చికిత్స చేయించుకున్నాడు. అయినా ఫలితం లేక తీవ్రమైన నొప్పి వస్తుండటంతో బుధవారం అర్ధరాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయన కుమార్తె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## వడదెబ్బతో కూలీ...



సూర్నపాక లక్ష్మయ్య (ఫైల్)

టేకులపల్లి: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం చింతోనిచెలక గ్రామానికి చెందిన సూర్నపాక లక్ష్మయ్య (50) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా వడదెబ్బతో అస్వస్థతకు గురై కింద పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

## వరి ధాన్యం కల్లానికి నిప్పు

చర్ల: మండలంలోని గొమ్ముగూడెంలో బుధవారం అర్ధరాత్రి కల్లంలో ఆరబోసిన ధాన్యానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టగా రూ.30 వేల విలువైన ధాన్యం కాలిపోయింది. గ్రామానికి చెందిన రైతు పుల్లారెడ్డి వరి సాగు చేయగా, ఇటీవలే కోసిన ధాన్యాన్ని ఆరబోశాడు. ధాన్యం కుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మూడు క్వింటాళ్ల మేర ధాన్యం కాలిపోయింది. ఇంతలోనే స్థానికులు గమనించి మంటలు ఆర్పడంతో భారీ నష్టం తప్పినట్లయింది.

## జీకే ఓసీకి చెందిన శాప్ కేబుల్ దగ్ధం



గుట్టపై ఎగిసిపడుతున్న మంటలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం సమీపాన గుట్టపై బుధవారం అర్ధరాత్రి మంటలు ఎగిసిపడ్డాయి. అది జాతీయ రహదారి కావడంతో కార్మికులు, ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో జీకే ఓసీకి వెళ్లే శాప్ కేబుల్ కాలిపోయింది. ఆలస్యంగా అందిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆ తర్వాత ఉద్యోగులు కాలిపోయిన శాప్ కేబుల్‌ను తొలగించి కొత్తది బిగించారు.

## చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలుశిక్ష

భద్రాచలంఅర్బన్: చెక్‌బౌన్స్ కేసులో ఎటపాకకు చెందిన వరకా శ్రీనివాస్‌కు జైలుశిక్ష విధిస్తూ భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సూరిరెడ్డి గురువారం తీర్పు ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. భద్రాచలానికి చెందిన లింగమర్ల శ్రీనివాస్ 2016లో ఎటపాకకు చెందిన వరకా శ్రీనివాస్ రూ.4లక్షలు అప్పుగా ఇచ్చాడు. అనంతరం గడువు తీరాక ఆయన ఇచ్చిన చెక్కును బ్యాంకులో సమర్పించగా నగదు లేకపోవడంతో బౌన్స్ అయింది. దీంతో న్యాయవాదులు పామరాజు తిరుమలరావు, పడవల శ్రీనివాస్ ద్వారా లింగమర్ల శ్రీనివాస్ కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం వరకా శ్రీనివాస్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించడంతో పాటు నెలలోగా రూ.4లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

## పాత కక్షల నేపథ్యంలో దాడి

పాల్వంచ : పాత కక్షల నేపథ్యంలో దాడి ఘటనలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఇద్దరిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. బాపూజీనగర్‌కు చెందిన సక్కుబాయి –సురారం గ్రామానికి చెందిన గుగులోతు చిట్టెమ్మ, ఆమె కుమారుడు సాయికి పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో వారి మధ్య బుధవారం ఘర్షణ జరగడంతో సక్కుబాయిపై వారిద్దరూ దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.రాము వారిపై కేసు నమోదు చేశారు.